# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో 904 కోట్ల రూపాయలతో మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఎం టెర్మినల్స్ సంస్థతో ఏపి మారిటైమ్ బోర్డ్ అవగాహనా ఒప్పందం చేసుకుంది.
- ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ రెండు విభాగాల్లో 2025 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులను దక్కించుకుంది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.

===========================

రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో 904 కోట్ల రూపాయలతో మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమయ్యింది. ఈ సందర్భంగా చర్చించిన 33 అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. ఏపీ సర్క్యులర్ ఎకానమీ, నూతన వేస్ట్ రీసైక్లింగ్ పాలసీలకు ఈ సమావేశంలో ఆమోదం లభించిందన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపుల మార్గదర్శకాలకు సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యూటేషన్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 2 వేల 778 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి పార్థసారధి తెలియజేస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

===========================

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్, ఏపీఎం టెర్మినల్స్ మధ్య ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఎం టెర్మినల్స్ సంస్థతో ఏపీ మారిటైమ్ బోర్డ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

నాయుడు సమక్షంలో ఈరోజు అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీఎం టెర్మినల్స్ సంస్థ రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట ఓడరేవుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటూ.. పోర్టుల నిర్వహణను చేపట్టనుంది. అదే విధంగా 9 వేల కోట్ల రూపాయలతో ఓడరేవుల్లో ఆధునిక టెర్మినల్స్, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి తద్వారా 10 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనుంది.

===========================

"పరోపకారం పరమో ధర్మః" అనేది మన భారతీయ ధర్మమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఎదుటివారికి, సమాజానికి సేవ చేయడం మన సంస్కృతిలో భాగమని, అందుకే మనది పుణ్యభూమి అయ్యిందన్నారు. అందరూ బాగుండాలనే ఉద్దేశంతో గతంలో జన్మభూమి కార్యక్రమం చేపట్టి సమాజంలో మార్పుకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో నేడు "జీరో పావర్టీ - పీ4'' కార్యక్రమాన్ని తలపెట్టామని, దీనికి వస్తున్న స్పందన ఎంతో సంతృప్తినిస్తోందని వెల్లడించారు. డబ్బు సంపాదన కంటే.. దాన్ని తిరిగి సమాజంపై ఖర్చు చేయడమే ఎక్కువ తృప్తిని, నిజమైన సంతోషాన్ని ఇస్తుందన్నారు. సంపద సృష్టించిన ప్రతి ఒక్కరూ మంచి మనసుతో తిరిగి సమాజం కోసం వెచ్చించేందుకు ముందుకు రావాలని కోరారు.

===========================

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారాలైన స్కోచ్ అవార్డులు లభించాయి. 2025 సంవత్సరానికి గానూ ఆన్‌లైన కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, రీసర్వే 2.0 మొదలగు విభాగాల్లో రెవెన్యూ శాఖకు స్కోచ్ అవార్డులు దక్కాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు రెవెన్యూ శాఖకు ఈ అవార్డులు వచ్చాయని మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు. విప్లవాత్మక సంస్కరణలకు అవార్డులు వరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులను ఆయన అభినందించారు. ఇక వచ్చే నెల 20న ఢిల్లీలో స్కోచ్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

===========================

ఇటీవల యువత ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్ లో డబ్బులు నష్ట పోయి ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరులో కవిత అనే ఒక మహిళ ఆన్‌లైన్ గేమ్స్ లో 2 లక్షల 50 వేల రూపాయలను పోగొట్టుకోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఇటువంటి ఘటనలు అనేక చోట్ల పునరావృతమవుతుండటంతో... ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు, ప్రకటనలు, ఆర్థిక లావాదేవీలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025 ను పార్లమెంట్ లో ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు ఈరోజు పార్లమెంట్ లో ఆమోదం లభించింది.

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొద్ది సేపటి క్రితం ఢిల్లీకి బయలుదేరారు. రేపు మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు. సాస్కితో పాటు పూర్వోదయ పథకం తరహాలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎకనామిక్ టైమ్స్ నిర్వహించే "వరల్డ్

లీడర్స్ ఫోరం సదస్సు"కు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. అనంతరం ఢిల్లీ నుంచి అమరావతికి తిరుగు పయనమవుతారు.

============================

ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా "ఆది కర్మయోగి" కార్యక్రమంలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేస్తూ.. వారి ద్వారా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆది కర్మయోగి కార్యక్రమానికి సంబంధించి గత రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి అధికారుల శిక్షణా ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఈరోజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఏజెన్సీలో కింద స్థాయి నుండి పై స్థాయి వరకు ప్రతీ గ్రామం అభివృద్ధి చెందాలన్నారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా ఉద్యోగస్తులు, స్థానిక ప్రజలు అందరూ కర్మయోగిగా మారాలని సూచించారు.

============================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాగల రెండు రోజులకు వాతావరణ సూచనలను మెట్రాలజిస్ట్ జి. లక్ష్మి వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

============================

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను సమర్ధవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈరోజు ఉదయం దృశ్య మాధ్యమం ద్వారా రెవిన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తిరుపతి పట్టణంలో 10 క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని... 24వ తేదీన తారకరామా స్టేడియం నందు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

============================

గ్రామాల్లో నిరంతరాయంగా 24 గంటల పాటూ విద్యుత్ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) మేనేజింగ్ డైరక్టర్ పి.పుల్లారెడ్డి తెలిపారు. ఒంగోలులోని విద్యుత్ భవన్ లో ఈరోజు ఆయన సీపీడీసీఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆకాశవాణితో మాట్లాడుతూ... జిల్లాలో ఆర్డీఎస్, నూతన సబ్ స్టేషన్లు, పీఎం సూర్య ఘర్ పనుల పురోగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6 నూతన సబ్ స్టేషన్ల పనులు జరుగుతున్నాయని, అధనంగా మరో 6 సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాలకు 24 గంటలూ త్రీఫేజ్ విద్యుత్ అందించేందుకు ఫీడర్ల విభజన జరుగుతోందన్నారు.

============================
============================